ఉపాధిహామీ సిబ్బందికి రూ.70 వేలు జరిమానా
-ప్రజా వేదికలో అధికారుల వెల్లడి

ప్రజా వేదికలో వివరాలను సరి చూస్తున్న అధికారులు

బొంరాస్‌పేట, జూన్ 25 : ఉపాధిహామీ పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీలో సిబ్బంది చేసిన పొరపాట్లకు రూ.70 వేలు జరిమానా విధించారు. వీటిని సిబ్బంది నుంచి రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు రూ.6.94 కోట్లతో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ సిబ్బంది గ్రామాల్లో పనులు పరిశీలించారు. పనుల్లో జరిగిన లోటుపాట్లను గుర్తించిన తనిఖీ సిబ్బంది సోమ, మంగళవారాల్లో మండలస్థాయిలో నిర్వహించిన ప్రజా వేదిక సభలో గ్రామాల వారీగా చదివి వినిపించారు. మంగళవారం సాయంత్రంతో అన్ని గ్రామాల వివరాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ మేనేజర్ రవి, ఏపీడీ సరళ, విజిలెన్స్ అధికారి భార్గవి, అంబుడ్స్‌మెన్ రాములు, ఎంపీడీవో వెంకన్‌గౌడ్, ఎంపీవో మహేష్‌కుమార్, ఎస్ఆర్‌పీలు స్వామి, గంగరాజు, ఏపీవో మల్లికార్జున్, ఈసీ ఇలియాస్, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేరాల అదుపే ప్రధాన లక్ష్యం కావాలి: డీఎస్పీ

సమావేశంలో మాట్లాడుతున్న తాండూరు డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి

పెద్దేముల్, జూన్ 25 : పోలీసులు నేరాలను అదుపుచేయడానికి కృషి చేయాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు.మంగళవారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజంలో నేరాలను తగ్గించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. అందుకు ప్రజలకు నేరాలపై , సీసీ కెమెరాల పనితీరుపై, డ్రంక్ అండ్ డ్రైవ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా సీసీ కెమెరాలతో నేరాలను అదుపు చేయవచ్చని, వాటికి జీతం, ఇంక్రిమెంట్‌లు, రెస్ట్‌లు, పండుగలు, అలవెన్స్‌లు ఏవి ఉండవని 24 గంటలు వాటి పని అవి చేస్తూ ఉంటాయన్నారు. పోలీసులు ప్రజలతో పరిచయాలు పెంచు కోవడం వలన ముందస్తుగా గ్రామాల, నేరాల సమాచారం తెలియడం వల్ల నేరాలను అదుపుచేసే అవకాశం ఉంటుందన్నారు. ఆయన వెంట తాండూరు రూరల్ సీఐ ఎన్.అశోక్, పెద్దేముల్ ఎస్ఐ కె. గిరి, ఏఎస్ఐ బక్కన్న తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల దృష్ట్యా అప్రమత్తత

మందు పిచికారి చేస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్

పరిగి, జూన్ 25 : సీజనల్ వ్యాధుల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ సూచించారు. మంగళవారం పరిగి మున్సిపల్ పరిధిలో వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధుల రాకుండా నివారణలో భాగంగా 4వ వార్డులోని మురికికాలువలలో డోమ లార్వా నిర్మూలనకు టెన్నిపాస్ మందును మున్సిపల్ చైర్మన్ అశోక్ పిచికారీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. డోమలు ఆవాసం ఏర్పరచుకునే వీలు ఉండకుండా చూడాలన్నారు. మురికినీరు నిలువకుండా చూడాలని, పాత సామాగ్రిలో వర్షపు నీరు ఉండకుండా తగు జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్ వారాల రవీంద్ర, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

దోమ,జూన్ 25 : ఆర్మీ జవాను ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన దోమ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది.ఎస్సై ఆనంద్‌కుమార్,బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపల్లి గ్రామానికి చెందిన గొటికె రాములు కుమారుడు చింటూ (21) ఏడు నెలల క్రితం అగ్నిపథ్(ఇండియన్ ఆర్మీలో) ఎంపికై బెంగళూరు ఏఎస్‌సీ సెంటర్‌లో ట్రైనింగ్ పూర్తి చేసుకొని ఈ నెల 22న పదిహేను రోజుల సెలవులపై స్వగ్రామానికి వచ్చాడు.ఈ క్రమంలో గుండాల గ్రామానికి చెందిన ఓ విద్యార్థినిని వెంబడించి చింటు (ఆర్మీ జవాన్)తన స్నేహితులైన శ్రీకాంత్,శివలతో కలిసి అసభ్యకరంగా ప్రవర్తించి వెళ్లిపోయా రు. ఈ విషయంపై బాధితురాలి తండ్రి చింటూను మందలించాడు. అంతేకాక చింటూ ఇంటికి వచ్చి అతని తండ్రికి విషయం చెప్పి మళ్లీ ఇటువంటివి జరగకుండా చూసుకోవాలని చెప్పి వెళ్లాడు.ఈ విషయం ఊర్లో తెలిస్తే కుటుంబం పరువు పోతుందని భావించిన చింటూ సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా బండి తీసుకొని బయటకు వెళ్లాడు.ఎంత సేపటికి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అంతటా వెతకగా చింటూ పొలం దగ్గర ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తమ కుమారుడిని బెదిరించినందు వల్లనే ఆత్మహత్య చేసుకున్నాడని, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తండ్రి రాములు మంగళవారం దోమ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆనంద్‌కుమార్ తెలిపారు.

28న మండల సర్వసభ్య సమావేశం

వికారాబాద్, జూన్ 25 : ఈ నెల 28న మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షురాలు చంద్రకళ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు వికారాబాద్ ఎంపీడీవో వినయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి కో ఆప్షన్ సభ్యులు, స్పెషల్ ఆఫీసర్లు , ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సకాలంలో హాజరు కావాలని సూచించారు. అలాగే పలువురు ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు.

■ విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ

కులకచర్ల, జూన్ 25 : చౌడాపూర్ మండల పరిధిలోని వాల్యానాయక్‌తండాలో వికారాబాద్ బీజేపీ గిరిజన మోర్చా కార్యదర్శి శంకర్‌నాయక్ ఆ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం. వెంకటేశ్, చౌడాపూర్ మండల బీజేపీ గిరిజన మోర్చా అధ్యక్షుడు పాండునాయక్, యువజన సంఘం అధ్యక్షుడు హన్మంతు, యువకులు భాస్కర్, జగన్, విశాల్, రంజిత్ పాల్గొన్నారు

మెరుగైన వైద్యం అందించాలి

వైద్యులతో మాట్లాడుతున్న న్యూట్రిషన్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సాయిబాబా

కులకచర్ల, జూన్ 25: ప్రభుత్వ దవాఖానలపై ప్రజలకు నమ్మకం కలిగేలా మెరుగైన వైద్యం అందించాలని మాతా శిశు సంరక్షణ, న్యూట్రిషన్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సాయిబాబా అన్నారు. మంగళవారం కులకచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఉన్న వైద్యులను ఆస్పత్రి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఉన్న సిబ్బంది వివరాలను తెలుసుకొని వారు నిర్వహిస్తున్న విధుల గురించి సీహెచ్‌వో చంద్ర ప్రకాశ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో వైద్యులు రాత్రింబవళ్లు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఆస్పత్రిలో ఎన్నికాన్పులు అవు తు న్నాయి, కాన్పులకు సంబంధించి ఎన్నిమందులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మూడు నెలలలోపు గర్భిణులు ఆస్పత్రిలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఐరన్, క్యాల్షియమ్ మందులు అందించాలని, మూడు నెలల్లో మొదటి డోస్ టీడీ, 5నెలల్లోపు రెండవ టీడీ ఇన్‌జక్షన్ తీసుకోవాలని తెలిపారు. రక్తం తకువగా ఉన్నవారికి ఆస్పత్రిలో ఐరన్ సుక్కోజ్ ఎక్కించాలని, క్రమం తప్పకుండా అన్ని రకాలు పరీక్షలు చేయించుకోవాలన్నారు. స్కానింగ్ టెస్టులు కూడా చేయించుకోవాలని, దీని ద్వారా కడుపులో పెరుగుతున్న బిడ్డ ఎదుగుదల గురించి పూర్తిగా తెలుసుకోవచ్చునన్నారు. గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలంటే అన్ని రకాల ఆకు కూరలు, కూర గాయలు, పండ్లు, మాంసం, కోడి గుడ్లు తినాలని సూచించారు. హైరిస్క్ కాన్పులు ముందుగానే గుర్తించి పెద్ద ఆస్పత్రులకు పంపించాలని సూచించారు. కాన్పుల తరువాత రెగ్యులర్ విజిట్‌లు చేయాలని ఏఎన్ఎంలను, ఆశాకార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వాజిహుద్దీన్, డాక్టర్ మాధురి, డాక్టర్ ప్రశాంతి, సూపర్‌వైజర్లు స్వరూపరాణి, రత్నలత, విజయలక్ష్మి, నవీన్, రమేశ్, ప్రశాంత్, సిరాజ్, ఆయా యాదమ్మ, ఏఎన్ఎంలు చంద్రకళ, సుజాత, ఆశాకార్యకర్తలు పుష్ప, మంజుల, రాధ, లావణ్య పాల్గొన్నారు.

నవాబుపేట,జూన్25: వికారాబాద్ జిల్లా నూతన కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను చేవెళ్ల ఎమ్మెల్యే కాలెయాదయ్య మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తన నియోజక వర్గంలోని నవాబుపేట మండలం వికారాబాద్ జిల్లాలో భాగంగా ఉండడంతో అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే యాదయ్య సూచించారు.

అధికారంలో లేకున్నా..అండగా ఉంటా..
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

దౌల్తాబాద్‌లో మోహన్‌రెడ్డి చిత్రపటం ముందు నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి.

కొడంగల్, జూన్ 25: కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పర్యటించి బాధిత కుటుంబాలను కలిసి సానుభూతిని వ్యక్తం చేశారు. మంగళవారం దౌల్తాబాద్ మండలంలో మాజీ జడ్పీటీసీ మోహన్‌రెడ్డి గుండె పోటుతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. రాజకీయంగా ఎనలేని సేవలను అందించడం జరిగిందని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో లేనప్పటికీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని, ఎంతటి కష్టం వచ్చిన అండగా నిలుస్తానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కోట్ల మహిపాల్, కౌన్సిలర్ మధుసూధన్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు ప్రమోద్‌రావు, మహేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే రూ.50 వేల ఆర్థిక సహాయం

బొంరాస్‌పేట, జూన్ 25 : బొంరాస్‌పేట మండల బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ నెహ్రూనాయక్‌కు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మంగళవారం రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. నెహ్రూనాయక్ భార్య సుమిత్ర ఇటీవల గ్రూప్ పరీక్ష రాసి వస్తుండగా బైక్‌పై నుంచి కిందపడి మృతిచెందిన విషయం తెలిసిందే. అమెరికా నుంచి తిరిగి వచ్చిన పట్నం నరేందర్‌రెడ్డి మంగళవారం దేవులానాయక్‌తండాలో పరామర్శించి ధైర్యం చెప్పారు. రూ.50 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోట్ల యాదగిరి, మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, దేశ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మంగళవారం వికారాబాద్ నుంచి ఓ ఆటోలో సామర్థ్యానికి మించి విద్యార్థులను మహ్మదాన్‌పల్లి తీసుకెళ్తున్న దృశ్యం ఇది. ఎన్ని ప్రమాదాలు జరిగినా కూడా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.
-నవాబుపేట

■ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకాలు..

బొంరాస్‌పేట మండలంలోని నాందార్‌పూర్‌లో..



కులకచర్ల మండల కేంద్రంలో..

బొంరాస్‌పేట, జూన్ 25 : బ్యాంకుల్లో రైతులు తీసుకున్న రూ.2 లక్షల పంట రుణాలను ఆగస్టు 15వ తేదీలోగా మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నాందార్‌పూర్ గ్రామంలో మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ ఆధ్వర్యంలో రైతులు మంగళవారం సీఎం చిత్రపటానికి క్షీరా భిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటయ్య పాల్గొన్నారు.
కులకచర్ల: ప్రభుత్వం ఒకే సారి రెండు లక్షల రుణమాఫీ చేసేందుకు నిర్ణయించడం అభినందనీయమని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, కులకచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు తెలిపారు.
మంగళవారం కులకచర్ల మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భీంరెడ్డి, కుమ్మరి స్వామి, గోపాల్‌నాయక్, కర్రె భరత్‌కుమార్, అంజిలయ్యగౌడ్, ఎంపీటీసీలు రాంలాల్, ఆనందం, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగు భూములకే రైతు భరోసా ఇవ్వాలి

బొంరాస్‌పేట రైతువేదికలో వీసీలో పాల్గొన్న అధికారులు, రైతులు.

బొంరాస్‌పేట, జూన్ 25 : రైతుభరోసా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే పెట్టుబడి సాయాన్ని సాగు చేసే భూములకే ఇవ్వాలని పలువురు రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కొడంగల్ ఏడీఏ శంకర్ రాథోడ్, బొంరాస్‌పేట, కొడంగల్ ఏవోలు అనురాధ, లావణ్య, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు. సాంకేతిక సమస్యతో వీసీలో నేరుగా మాట్లాడే అవకాశం లేకపోవడంతో రైతులు తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా రాసిచ్చారు. పడావు భూములు, రియల్ ఎస్టేట్ భూములకు పెట్టుబడి సహాయం ఇవ్వరాదని, సీజన్‌కు ముందే సహాయం అందించాలని, 10 ఎకరాలలోపు రైతులందరికీ సహాయం అందించాలని కోరారు. అదేవిధంగా సన్నరకం, దొడ్డురకం వడ్లకు కూడా ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని రైతులు కోరారు.

రూ.లక్షా పదివేలు పలికిన తైబజార్ వేలం

దోమ,జూన్ 25: దోమ మండల కేం ద్రంలో ప్రతి మంగళవారం జరిగే సంతకు మంగళవారం ఎంపీవో సోమలింగం ఆధ్వర్యంలో వేలం పాటను నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆరు గురు వ్యక్తులు పోటీ పడగా చివరకు చాకలి మొగులయ్య లక్షా పది వేల రూపాయలకు తైబజార్ వేలం దక్కించుకున్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వ్యాపారస్తులకు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకొని సంత సజావుగా జరిగే విధంగా కృషి చేయాలని వేలం దక్కించుకున్న మొగులయ్యకు అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, కోఆప్షన్ ఖాజాపాషా,మాజీ సర్పంచ్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో పనులు పూర్తి చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణనాయక్

కులకచర్ల, జూన్ 25 : పాఠశాలల్లో మూడు రోజుల్లో పనులు పూర్తి చేసేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, అధికారులు కృషిచేయాలని ఎంపీడీవో రామకృష్ణనాయక్ తెలిపారు. మంగళవారం కులకచర్ల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల నిర్వ హణపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కులకచర్ల మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో 100 శాతం పనులు పూర్తి చేయించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనులు నిర్వహించాలని, పూర్తి చేసిన పనులకు రికార్డులు చేయించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, మైనర్ రిపేర్లు పూర్తి అయ్యే విదంగా చూడాలని అన్నారు. పనులు నాణ్యత ఉండేలా చూడాలని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో కులకచర్ల మండల ప్రత్యేక అధికారి సరళాదేవి, డిప్యూటీ ఈఈ సుబ్రహ్మణ్యం, కులకచర్ల ఏంఈవో అబీబ్‌హైమద్, ఎంపీవో కరీమ్, ఏపీఎం శోభ, మండల ప్రత్యేక అధికారులు, వివిద పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, సీసీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో పనుల పురోగతిపై సమీక్ష



దోమ: ప్రధానోపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న స్పెషల్ ఆఫీసర్ హన్మంత్‌రావు

దోమ, జూన్ 25: అమ్మా ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేసే దిశగా కృషి చేయాలని దోమ మండల స్పషల్ ఆఫీసర్ హన్మంత్‌రావు, ఎంఈవో హరిశ్చందర్ అన్నారు. దోమ మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలో అమ్మా ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో స్పెషల్ ఆఫీసర్ హన్మంత్‌రావు, ఎంఈవో హరిశ్చందర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో జరిగే పనులను ప్రధానోపాధ్యాయులు పరిశీలించి అతి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల వారీగా పనుల పురోగతిని వారు అడిగి తెలుసుకున్నారు. అడ్మీషన్లు ఎన్ని జరిగాయి , విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్సు ఎంత మందికి అందాయి అనే అంశాలతో పాటు వసతుల కల్పన తదితర విషయాలను చర్చించారు. అనంతరం దోమ మండలానికి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా వచ్చిన వారందరిని ఎంఈవో హరిశ్చందర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్‌బాబు,కాంప్లెక్స్ హెచ్ఎం లాల్యానాయక్, అమర్నాథ్, ఆంజనేయులు, హెచ్ఎంలు, సీఆర్పీలు, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

మర్పల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో విద్యాసాగర్

మర్పల్లి: అమ్మ ఆదర్శ పాఠశాలల్లోని పనులు ఏమైనా పెండింగ్‌లో ఉంటే త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు.. మంగళవారం మండల ప్రజాపరి షత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు.. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజమల్లయ్య, తహసీల్దార్ గణేశ్, ఎంఈవో విద్యాసాగర్, ఏపీఎం మధుకర్, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా మా క్లయింట్ M/s శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ నారాయణపేట బ్రాంచ్ వారు Midigeri Srisailam S/o M.Balappa, age 29 years, Occ: Business, R/o H.No.1-137, Suraipalle Village, Doulthabad Mandal, Vikarabad Dist., **Applicant / Borrower / Prop. Holder** గారికి ఇచ్చు వ్యాపార లోన్ వ్యవహారాలలో తమ సొంత ఆస్థిని తనఖా పెట్టుటకు అంగీకరించి నారు. కావున ఇట్టి ఆస్థి పై ఎవరికైనా ఆక్షేపణలు మరియు క్లెయిములు ఉన్న యెడల ఈ తేది నుండి 3 రోజులలో మా ఆఫీస్‌లో గాని లేదా మా క్లయింట్ ఆఫీస్‌లో గాని సంప్రదించగలరు.

SCHEDULE OF THE PROPERTY

Unnumbered residential house, constructed in open plot admeasuring 242 Sq.Yrds., out of Sy.No.123/8, having plinth area of 1147 SFT., situated at Suraipalle Village Shivara of Doulthabad Mandal, Vikarabad Dist., which is bounded as under:
East: House of B. Ananthaiah,
West: Open place of K. Sayappa,
North: House of M. Balamma,
South: GP Road.

MALLIKARJUN B.A, LL.B.,
Advocate, 1-6-41/12, Satya Sai Colony, Narayanpet. Cell: 9440393742

IN THE HIGH COURT FOR THE STATE OF TELANGANA AT HYDERABAD

W.P.No.35669 of 2015

Between :

Gaddam Narsaiah @ Narasimha and Others
..Petitioners

And

The State of Telangana & others
...Respondents

To
M/s. Raghavendra Welfare Association

Reg.No.1891/2006, office at 16-11-656/1, behind Pragathi Women's Degree College Dilsukhnagar, Hyderabad.
Rep..by its Secretary Sri A.Subrahmanyam.
...Respondent No.5

Sir,

The above Writ was filed questioning the orders dated **03.09.2015** in **Case No.F1/5050/2010** passed by the Joint Collector, Rangareddy District under Andhra Pradesh(Telangana Area) Abolition of Inams Act. 1955. In the above said Writ, you have been arrayed Respondent No.5.

While hearing the matter, the Hon'ble High Court on **18.06.2024**, in **I.A. No. 1 of 2024,** ordered to issue notice to you, the above named, by way of paper Publication and posted matter on **15.07.2024.** Therefore, please take notice that the above Writ petition is posted on **15.07.2024** for your appearance and counter if any. Therefore, you have to appear before the Hon'ble High Court of Telangana either in person or through Advocate on or before **15.07.2024** at 10.30 am. failing which, the matter will be decided in your absence.

P.RAGHAVENDRA RAO
Counsel for the Petitioner